క్లుప్తంగా

రీసెర్చ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

యానాం: మెడికల్ రీసెర్చ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని పుదుచ్చేరి జిప్‌మెర్ సంస్థ అధికారులు సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. మెడికల్ రీసెర్చ్ కోర్సులు(పీహెచ్‌డీ) బయోకెమిస్ట్రీ, ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్, మెడికల్ ఆంకాలజీ కోర్సులకు జులై 7న ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకూ ప్రవేశపరీక్ష నిర్వహిస్తారన్నారు. జులై 22వ తేదీకి ఫలితాలు విడుదల చేస్తామన్నారు.

ముగిసిన హనుమజ్జయంతి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో దాసాంజనేయస్వామివారు

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసియున్న దాసాంజనేయస్వామివారి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కొండవీటి శ్రీరామ్ నేతృత్వంలో ఐదు రోజుల పాటు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. చివరిరోజైన సోమవారం స్వామివారికి ప్రీతిపాత్రమైన అప్పాలతో దండ వేసి అలంకరించారు. అదేవిధంగా అరటిపండ్లు, మామిడి పండ్లు నైవేద్యంగా సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన


యానాంలో కౌంటింగ్ హాలును పరిశీలిస్తున్న పరిశీలకుడు రాకేష్ కుస్రే

యానాం: పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజకవర్గానికి ఎన్నికల కమిషన్ నియమించిన కౌంటింగ్ పరిశీలకుడు రాకేష్ కుస్రే సోమవారం స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమ్‌ను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ పరిశీలకుడు రాకేష్ కుస్రే మాట్లాడుతూ కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే పలు ఆదేశాలు ఇచ్చామన్నారు. కౌంటింగ్ హాలు లోపల, బయట తగినంత భద్రతను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ సక్రమంగా నిర్వహించేలా అందరూ సహకరించాలని కోరారు.

9 వరకూ దివ్యాంగ బాలల గుర్తింపు

ఐ.పోలవరం: నాన్ భవిత సెంటర్ ద్వారా సమగ్ర శిక్షా ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని సచివాలయాలు, అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలోని దివ్యాంగ బాలలను గుర్తించే కార్యక్రమాన్ని ఈ నెల 9 వరకూ నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 0–18 ఏళ్ల గల దివ్యాంగ బాలలను గుర్తించి వారిని ప్రత్యేక అవసరాలు గల పాఠశాలలో చేర్పిస్తామన్నారు. ఇప్పటి వరకూ 20 మందిని గుర్తించి పాఠశాలల్లో చేర్చామన్నారు.

పీపీఎల్ క్రికెట్ లీగ్ విజేత కోరంగి

తాళ్లరేవు: మండల పరిధిలోని పటవల హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన పీపీఎల్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ విజేతగా కోరంగి జట్టు నిలిచింది. సీనియర్ క్రీడాకారులు మోర్త జాన్ ప్రసాద్ జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్ నిర్వహించినట్లు నిర్వాహకుడు అజయ్ వర్మ తెలిపారు. టోర్నమెంట్‌లో తాళ్లరేవు, ఐ.పోలవరం, కరప, కాజులూరు మండలాలకు చెందిన 28 జట్లు పాల్గొనగా కోరంగి జట్టు విజేతగా, వేళంగి జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా విజేత జట్టుకు భజన సత్తిబాబు బహుమతి ప్రదానం చేశారు.


స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం


సోము రాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే రాపాక తదితరులు

మలికిపురం: అనారోగ్య సమస్యతో స్నేహితుడు పెసింగి సోము రాజు(బట్టెలంక) కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. నిరుపేదలైన కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. ఇది గమనించిన తోటి స్నేహితులు, అందరూ కలసి సమకూర్చిన రూ. 50,000 ఆర్థిక సహాయాన్ని స్నేహితుని భార్యకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చేతుల మీదుగా అందజేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో రాజు చిత్ర పటానికి ఎమ్మెల్యే రాపాక పూలమాలలు వేసి నివాళులర్పించి సాయం అందించారు. రాపాక నవీన్, పెదపాటి అనిల్, ఒగురి స్టీవెన్, చెవ్వకుల రాజు, గెద్దం రవి, చొప్పల రాజేంద్ర, మంగేన సతీష్, గంట దిలీప్, చొప్పల భాను, మట్టా అనిల్, చింతా రమేష్ మరి గల్ఫ్ స్నేహితులు పాల్గొన్నారు.

అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే

- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- గెలుపుపై ఇరు పార్టీల అభ్యర్థుల ధీమా



అమలాపురం టౌన్/ముమ్మిడివరం: అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మరికొద్ది గంటల్లో తేలిపోనున్నాయి. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఇరవై రోజుల క్రితమే ముగిసినా ఫలితాల కోసం అభ్యర్థులు, పార్టీల శ్రేణులతో పాటు ప్రజలూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనుండడంతో ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓటర్ల తుది తీర్పు ఏమిటో వెల్లడి కానుంది. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీ అభ్యర్థుల నడుమ హోరాహోరీ పోరు నెలకొంది. ఈసారి ఎన్నికల్లో సైలెంట్ ఓటింగ్ కారణంగా విజయం ఎవరిని వరిస్తుందోనని ప్రజలు సైతం ఒళ్లంతా కళ్లు చేసుకుని ఎదురు చూస్తున్నారు. అయితే గెలుపుపై ఇరు పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియపైనే దృష్టి

గత నెల 13వ తేదీన పోలింగ్ అనంతరం భద్రతా దృష్ట్యా ఈవీఎం, ఈవీప్యాట్‌లను చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లను తరలించారు. అక్కడే స్వామి వివేకానంద సెమినార్ హాల్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుంది. అమలాపురం, ముమ్మిడివరం వైఎస్సార్ సీపీ అభ్యర్థులు మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, టీడీపీ అభ్యర్థులు అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిబాబు తమ తమ నియోజకవర్గాల్లో సోమవారం తమ పార్టీల తరఫున ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వెళ్లే కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల విషయంలో అనుసరించాల్సిన విధానాలు, జనరల్ ఓట్ల లెక్కింపు సమయంలో రౌండ్ల వారీగా కౌంటింగ్ ఏజెంట్లుగా వారి పాత్ర ఎంత కీలకమో అభ్యర్థులు అవగాహన కల్పించారు.

ఎవరి ధీమా వారిదే

ఈసారి ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడి వైఎస్సార్ సీపీతో తలపడడంతో రసవత్తర పోరు అనివార్యమైంది. పైగా ఈదఫా ఎన్నికల్లో ఓటింగ్ శాతం సైతం పెరిగింది. పెరిగిన ఓట్లు ఎక్కువగా యువత, మహిళలు, వృద్ధుల వేనని స్పష్టంగా తేటతెల్లమైంది. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఇతర పట్టణాల్లో ఉంటున్నవారు సైతం ఓట్ల పండగకు సొంతూరికి వచ్చి బాధ్యతగా ఓటేశారు. అల్లవరం మండలం మొగళ్లమూరు, బెండమూర్లంక, ఓడలరేవు, అమలాపురం మండలం నడిపూడి తదితర అనేక పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటల నుంచి 9 గంటల వరకూ సైతం పోలింగ్ ప్రక్రియ జరిగింది. సైలెంట్ ఓటింగ్ కారణంగా ఓటర్లు ఎటు వైపు తీర్పునిచ్చారో పార్టీల అభ్యర్థులకు సైతం అంతుచిక్కని పరిస్థితి నెలకొంది. అయితే అమలాపురం, ముమ్మిడివరం రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఇరు పార్టీల అభ్యర్థులు మాత్రం గెలుపు తమదంటే తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధి కారణంగానే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారని వైఎస్సార్ సీపీ నాయకులు భావిస్తున్నారు. వైఎస్సార్ సీపీకి ఏయే గ్రామాల్లో ఎంతెంత మెజార్టీ వస్తుందో అభ్యర్థులు లెక్కలేసుకుని మరి విజయం ఖాయమని చెబుతున్నారు. మరోవైపు టీడీపీ నేతలు మాత్రం ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్ కారణంగానే ఎక్కువమంది ఓట్లు వేశారంటూ భాష్యం చెబుతున్నారు. కూటమి కారణంగా జనసేన, బీజేపీ ఓటింగ్ కలవడంతో తమ విజయం ఖాయమని టీడీపీ అభ్యర్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏదీ ఏమైనా గత 20 రోజులుగా ఫలితాల కోసం ఎదురు చూస్తున్న ఉత్కంఠకు ఓట్ల లెక్కింపుతో తెరపడనుంది. ఓటర్లు ఇచ్చిన తీర్పు మంగళవారం మధ్యాహ్నానికే తేలిపోయే అవకాశం కనిపిస్తుంది.

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తంగా 13 మంది అభ్యర్థులు బరిలో నిలిచినా వైఎస్సార్ సీపీ అభ్యర్థి మంత్రి పినిపే విశ్వరూప్, టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావుల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. నియోజకవర్గంలో 2,13,508 మంది ఓటర్లు ఉండగా 1,75,845 మంది ఓటేశారు. మొత్తంగా 82.36 శాతం పోలింగ్ నమోదైంది. అమలాపురం నియోజకవర్గానికి సంబంధించి 235 బూత్‌లకు గాను ఓట్ల లెక్కింపు కోసం 12 టేబుళ్లు ఏర్పాటుచేశారు. మొత్తంగా 24 రౌండ్లలో ఫలితం తేలనుంది.

ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, టీడీపీ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబుల మధ్యే హోరాహోరీ పోరు జరిగింది. ముమ్మిడివరం నియోజకవర్గంలో మొత్తం 2,45,296 మంది ఓటర్లు ఉండగా 2,05,163 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా 83.64 శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గంలో 268 బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలను ఒక్కో రౌండుకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. మొత్తంగా 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తవుతుంది.

పోలీసు వలయంలో అమలాపురం


డీఎస్పీ మహేశ్వరరావు

అమలాపురం టౌన్: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం అమలాపురం పట్టణం పూర్తిగా పోలీసు వలయంలో ఉంటుందని, పోలీసులకు పట్టణ ప్రజలు సహకరించాలని అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు కోరారు. మంగళవారం సెలవు దినం కావడంతో అమలాపురం పట్టణంలో దాదాపు 90 శాతం దుకాణాలు మూత పడి ఉంటాయని, మిగిలిన పది శాతం దుకాణాలు కూడా మూసివేయాలని వ్యాపార సంఘాలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని టిఫిన్, భోజన హోటళ్లు మాత్రం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ తెరుచుకోవచ్చని వెసులుబాటు ఇచ్చామన్నారు. పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులంతా శాంతి భద్రతల పరిరక్షణకు, పోలీసుల బందోబస్తు ఏర్పాట్లకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పట్టణంలో మంగళవారం దుకాణాలన్నీ మూసి వేసి పోలీసులకు సహకరిస్తున్నట్లు ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ తెలిపారు.

సైకిల్ తొక్కుదాం.. ఆరోగ్యంగా ఉందాం



అమలాపురంలో సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న వాకర్స్

అమలాపురం టౌన్: ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వాకర్లు సోమవారం ఉదయం ఐదు కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర నిర్వహించారు. స్థానిక గడియారం స్తంభం నుంచి మొదలైన వాకర్స్ సైకిల్ యాత్ర నల్లవంతెన, ఎర్ర వంతెన, వెంకటేశ్వర స్వామి దేవస్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల మీదుగా గడియారం స్తంభం సెంటరులోని గాంధీ విగ్రహం వద్దకు చేరుకుంది. నిత్యం సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవొచ్చని అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. బ్యాంకులు, బజార్లు, ఇతర అవసరాలకు బయటకు వెళ్లేవారు సైకిల్‌పై వెళితే ఉభయ తారకమైన ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పేరి నరసింహం, రంకిరెడ్డి కాశీ, వైఎస్ఎన్ మూర్తి, మాడా రాము, పుత్సా కృష్ణ కామేశ్వర్, పీవీ రమణ, వీవీఆర్ నాయుడు, కె.త్రినాథ్, పీకే కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

పార్టీ కౌంటింగ్ ఏజెంట్లకు మంత్రి విశ్వరూప్ సూచన


పార్టీ కౌంటింగ్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: ఓట్ల లెక్కింపు సమయంలో కౌంటింగ్ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కౌంటింగ్ ఏజెంట్లకు అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సూచించారు. స్థానిక యెండూరి కన్వెన్షన్ హాలులో నియోజకవర్గానికి చెందిన పార్టీ కౌంటింగ్ ఏజెంట్లకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి విశ్వరూప్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యర్థి అభ్యర్థికి పడిన ఓట్లను నిశితంగా పరిశీలిస్తూ ఉండాలని, అదే సమయంలో ఓట్ల లెక్కింపులో ఏ చిన్న తప్పిదం జరిగినా కౌంటింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నదీ లేనిదీ నిశితంగా పరిశీలించాలన్నారు. ఓట్ల లెక్కింపు పరంగా మీకు ఏవైనా సందేహాలుంటే పార్టీకి చెందిన న్యాయవాదుల వద్ద నివృత్తి చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని పట్టణం, మండలాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ పార్టీ నాయకులు కూడా సదస్సులో కౌంటింగ్ ఏజెంట్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సదస్సులో అమలాపురం పట్టణం, రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల పార్టీ అధ్యక్షులు సంసాని బులినాని, బొంతు గోవిందశెట్టి, కొనుకు బాపూజీ, బద్రి బాబ్జి, అమలాపురం, అల్లవరం మండల పరిషత్ అధ్యక్షులు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, అమలాపురం, ఉప్పలగుప్తం జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, గెద్దం సంపదరావు, జిల్లా పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు కుడుపూడి అశోక్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్రం సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, పట్టణ పార్టీ గృహ సారథుల కన్వీనర్ ఈతకోట శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్ బాల్ శిక్షణా తరగతులు


పోటీల్లో విజేతలైన విద్యార్థులతో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడా స్థలంలో నెల రోజులుగా జరుగుతున్న బాస్కెట్‌బాల్ ఉచిత వేసవి శిక్షణా తరగతులు ఆదివారం రాత్రితో ముగిశాయి. మాజీ ఐపీఎస్ అధికారి కుడుపూడి గోపాల కృష్ణ గోఖలే, మాజీ రాష్ట్ర మంత్రి కుడుపూడి ప్రభాకరరావు జ్ఞాపకార్థం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ తరగతుల్లో దాదాపు 200 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. ఆదివారం రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఏటా శిక్షణా తరగతులను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులను ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అభినందించారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణవు, పీకే రావు, మండల పరిషత్ అధ్యక్షురాలు కుడుపూడి భాగ్యలక్ష్మి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, మాజీ కౌన్సిలర్ పంపన పద్మలత, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. శిక్షణా తరగతులకు కోచ్‌లుగా వ్యవహరించిన వ్యాయామ ఉపాధ్యాయులు యనమదల బుజ్జి, ఆకుల ఉమ, కుడుపూడి బుజ్జి, సంసాని బాబి, ఎం.వెంకటరావు, వెటరన్ క్రీడాకారిణి షహీరా, షకీలాలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి సంసాని గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అలరించిన ఓరుగామి


నీలపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు ఓరుగామి క్రాఫ్ట్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు


తాము తయారుచేసిన క్రాఫ్ట్ ఆకృతులను ప్రదర్శిస్తున్న చిన్నారులు

తాళ్లరేవు: మండలంలోని నీలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల వేసవి వినోద కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజైన సోమవారం నిర్వహించిన ఓరుగామి క్రాఫ్ట్ కార్యక్రమం విద్యార్థులను అలరించింది. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఫణిశర్మ అధ్యక్షతన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పి.గన్నవరం ఉపాధ్యాయిని బి.చిట్టితల్లి కాగితాలతో వివిధ ఆకృతులు తయారు చేసే ఓరుగామి క్రాఫ్ట్ గురించి వివరించారు. పిల్లలచే పువ్వులు, పక్షులు, బుట్టలు మొదలగు అనేక ఆకృతులు చేయించారు. తొలుత డ్రాయింగ్ టీచర్ సుబ్రహ్మణ్యం చిత్రలేఖనం ప్రాముఖ్యత, మెళకువలు నేర్పించారు. అనంతరం పిల్లలతో బొమ్మలు గీయించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సమతా నాయకురాలు కె.కరుణ, యానాం కమిటీ కార్యదర్శి ఓ.దుర్గామహాలక్ష్మి, యూటీఎఫ్ జిల్లా నాయకుడు కె.సురేష్, ఇళ్ల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలలచే ఉత్సాహంగా ఓరుగామి

యానాం: స్థానిక మెట్టకూరు రమాబాయినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న బాలల వేసవి వినోదకేంద్రంలో క్రాఫ్ట్ టీచర్ బి.చిట్టితల్లి ఆధ్వర్యంలో చిన్నారులకు కాగితాలతో వివిధ ఓరుగామి ఆకృతులను తయారు చేసే విధానాన్ని సోమవారం నేర్పించారు. టోపీలు, పక్షులు, పడవలు, పువ్వులు తదితర ఆకృతులను చిన్నారులు ఆసక్తిగా నేర్చుకుని సొంతంగా వాటిని తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా టీచర్ చిట్టితల్లిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, సీఐటీయూ నేత దుర్గాప్రసాద్, టి.శ్రీనివాస్, ఉపాధ్యాయిని దుర్గామహాలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులతో సైంటిఫిక్ మ్యాజిక్


విద్యార్థులతో ప్రదర్శనలు చేయిస్తున్న మెజీషియన్ నాగేశ్వరరావు

అమలాపురం టౌన్: స్థానిక సూర్యనగర్‌లోని గోపాలకృష్ణ గోఖలే మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న బాలల వేసవి వినోద కేంద్రంలో మూడో రోజు సోమవారం మెజీషియన్ సైంటిఫిక్ మ్యాజిక్ షోను నిర్వహించారు. సైంటిఫిక్ మెజీషియన్ కాటూరు నాగేశ్వరరావు చేసిన పలు ప్రదర్శనలు విద్యార్థులను ఆలోచింపచేశాయి. ప్రతి మ్యాజిక్ వెనుక సైన్స్ ఉందని స్పష్టం చేస్తూ తన ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. కొన్ని ప్రదర్శనలను విద్యార్థులతో చేయించారు. అనంతరం మెజీషియన్ నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.సత్యనారాయణ, యూటీఎఫ్ సీనియర్ నాయకుడు మామిడిశెట్టి వెంకటేశ్వరరావు, జేవీవీ ఆడిట్ కమిటీ కన్వీనర్ బీఎస్ వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను పెంచండి.. భూతాపాన్ని తగ్గించండి..


మొక్కలను పెంచాలని త్రినాథ ప్రసాద్ గీసిన సందేశాత్మక చిత్రం


త్రినాథ ప్రసాద్, డ్రాయింగ్ టీచర్

రామచంద్రపురం రూరల్: మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథ ప్రసాద్ మొక్కలను పెంచి భూ తాపాన్ని తగ్గించాలంటూ సందేశం ఇచ్చేలా చిత్రాన్ని గీసి అందరి మెప్పు పొందారు. ప్రతి ఏటా పెరుగుతున్న ఎండలను, భూ తాపాన్ని తగ్గించాలంటే మొక్కలు పెంచడం ఎంత అవసరమో చిన్న పిల్లల నుంచే అవగాహన కల్పించాలన్న సంకల్పం ఆయన వేసిన చిత్రంలో కనిపిస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి, ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగమణిలు అభినందించారు.

త్వరితగతిన ఫలితాలు

ఓట్ల లెక్కింపు పరిశీలకుడు కైలాస్ బుండేల


మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్‌వైజర్లకు కౌంటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న కైలాస్ బుండేల

అమలాపురం రూరల్: ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి కచ్చితత్వంతో త్వరితగతిన ఫలితాల వెల్లడికి చర్యలు చేపట్టినట్లు ఓట్ల లెక్కింపు పరిశీలకుడు కైలాస్ బుండేల తెలిపారు. మండపేట అసెంబ్లీ నియోజకవర్గ పార్లమెంట్ సెగ్మెంట్‌కు సంబంధించిన మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయకులకు సోమవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో ఈవీఎంల పనితీరు, సాంకేతిక సమస్యలను అధిగమించే విధానం వివరించారు. ఆయన మాట్లాడుతూ ఈవీఎంలలో ఓట్ల లెక్కింపుకు సంబంధించి కౌంటింగ్ సూపరింటెండెంట్, సహాయకులకు పూర్తి అవగాహన ఉండాలని, లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పూర్తిచేసేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. ఈవీఎం కౌంటింగ్, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌లకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారని తెలిపారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, సూక్ష్మ పరిశీలకులు ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. తొలుత ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్ల లెక్కింపును ప్రారంభించి ఉదయం 8.30 గంట లకు పార్లమెంటు, అసెంబ్లీ ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కచ్చితమైన ప్రణాళికతో మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఫారం -21సీ డిక్లరేషన్ వంటి వాటితో సహా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. మండపేట రిటర్నింగ్ అధికారి డీవీఎస్ ఎల్లారావు మాట్లాడుతూ అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ఎంట్రీ పాయింట్ ఉంటుందన్నారు. కౌంటింగ్ స్టాఫ్, కౌంటింగ్ ఏజెంట్లు తదితరుల మొబైళ్లకు అనుమతి లేనందున వారి ఫోన్లను భద్రపరిచేందుకు ప్రత్యేకంగా కలెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈవీఎంల్లో నమోదైన ఓట్ల లెక్కింపు సందర్భంగా సమస్యలు వస్తే తక్షణం సరిదిద్దేందుకు బెల్ ఇంజినీర్స్ అందుబాటులో ఉంటారన్నారు.

వాడపాలెంలో యోగా శిక్షణ తరగతులు

కొత్తపేట: సంపూర్ణ ఆరోగ్యం, శారీరక, మానసిక ఉల్లాసానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని పూర్వపు జాతీయ క్రీడాకారుడు చీకట్ల రామారావు, రిటైర్డ్ పీఈటీ మారిశెట్టి సత్యనారాయణ అన్నారు. వాడపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీఘాకోళ్లపు భీమేశ్వరరావు సౌజన్యంతో కొత్తపేట స్వామి వివేకానంద యోగా ఆశ్రమం నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ తరగతులను చీకట్ల రామారావు, మారిశెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో వ్యాయామం అవసరమన్నారు. యోగా లేదా వ్యాయామంతో అనారోగ్య రుగ్మతలు తొలగాపోయి ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. యోగా మాస్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ యోగా శిక్షణ తరగతులు నిత్యం జరుగుతాయన్నారు. ఆరోగ్యంపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గనిశెట్టి గోవిందరాజు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీఘాకోళ్లపు భీమేశ్వరరావు, సభ్యులు సుతాపల్లి వెంకటసుబ్బారావు, ఆకుమూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

యానాం: పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజకవర్గ స్థానానికి ఏప్రిల్ 19న జరిగిన ఎన్నికల పోలింగ్‌లో గెలుపుపై పార్టీలు ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. సుమారు 46 రోజుల తరువాత మంగళవారం ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎవరు గెలుస్తారరోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. యానాం ఎంపీ స్థానానికి మొత్తంగా 26 మంది అభ్యర్థులు పోటీ చేసినా ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, సిటింగ్ ఎంపీ వైతిలింగం, హోంమంత్రి నమశ్శివాయం మధ్యే పోటీ నెలకొంది. బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమికి మద్దతిస్తున్న ఇండిపెండెంట్ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, న్యూఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్న మల్లాడి కృష్ణారావు సైతం నమశ్శివాయంకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రస్తుతం బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి రాష్ట్రంలో అధికారంలో ఉన్నా కాంగ్రెస్ గట్టి పోటీనిచ్చిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే గెలుపు తమదేనని ప్రధాన అభ్యర్థులిద్దరూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.